


షణ్ముఖ
RNI : APTEL / 2023 / 89152
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక




సంపుటి : 3 సంచిక : 118
సోమవారం 04 మే 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.

# మస్కట్ లో మహిళ వేదనకు స్పందించిన పవన్ కల్యాణ్

- మస్కట్‌లో వేధింపులకు గురవుతున్న అన్నమయ్య జిల్లా మహిళ
- రక్షించాలంటూ పవన్ కళ్యాణ్‌కు వీడియో ద్వారా విజ్ఞప్తి
- వెంటనే స్పందించి అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశాలు
- స్వదేశానికి రప్పించేందుకు వేగంగా చర్యలు
- భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)

కుటుంబ పోషణ కోసం మస్కట్ వెళ్లిన ఓ తెలుగు మహిళ అక్కడ తీవ్ర వేధింపులకు గురవుతూ, తనను కాపాడాలంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పంపిన వీడియో సందేశంపై ఆయన తక్షణమే స్పందించారు. ఆమెను వెంటనే స్వదేశానికి రప్పించాలని తన కార్యాలయ అధికారులను ఆదేశించారు.అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం గ్రామానికి చెందిన దూదేకుల షెహనాజ్ అనే మహిళ, పని చేసే చోట యజమానుల వేధింపులు తాళలేకపోయింది. "పవన్ కల్యాణ్ అన్నా కాపాడన్నా" అంటూ రోదిస్తూ ఆమె సోషల్ మీడియా ద్వారా పంపిన వీడియో ఉప ముఖ్యమంత్రిని కదిలించింది. తనకు తిండి, నీళ్లు కూడా పెట్టకుండా కొడుతున్నారని, ప్రాణాలు పోయేలా ఉన్నాయని ఆమె తన ఆవేదనను వెలిబుచ్చారు. ఈ వీడియో చూసి చలించిన పవన్ కల్యాణ్, షెహనాజ్‌ను వెంటనే స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఉప ముఖ్యమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. అధికారులు వెంటనే షెహనాజ్ భర్త ద్వారా ఒమన్‌లోని ఏజెంట్‌తో మాట్లాడారు. అదే సమయంలో, మస్కట్‌లోని భారత దౌత్య కార్యాలయాన్ని, భారత విదేశాంగ శాఖ అధికారులను సంప్రదించి, ఆమెను వీలైనంత త్వరగా భారత్‌కు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## 'మోదీ తత్వం'పై విశ్వవిద్యాలయ పాఠ్యాంశం



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 03)

గుజరాత్‌కు చెందిన మహారాజా సాయాజీరావ్ విశ్వ విద్యాలయం- 'సోషియాలజీ ఆఫ్ పేట్రియాటిజం' (దేశభక్తికి సంబంధించిన సామాజిక శాస్త్రం) అనే రెండేళ్ల కోర్సును ప్రవేశపెట్టింది. ఇందులో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రజాకర్షక నాయకత్వాన్ని విశ్లేషించే పాఠ్యాంశంతోపాటు ఆరెస్సెస్ చరిత్రను కూడా చేర్చామని విశ్వవిద్యాలయ అధికారి ఒకరు తెలిపారు. "మోదీ తత్వాన్ని వైజ్ఞానికంగా విశ్లేషించడంతోపాటు ఈ కోర్సు ద్వారా సామాజిక సంస్కర్తలైన ఛత్రపతి శివాజీ మహారాజ్, 3వ గైక్వాడ్ వంటివారు చేసిన పనులపై అవగాహన కల్పిస్తాం" అని విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వీరేంద్ర సింగ్ తెలిపారు. "మీకు నచ్చినా నచ్చకపోయినా ప్రధానమంత్రి మోదీ నేతృత్వాన్ని, రాజకీయ రంగంలో ఆయనకున్న ప్రజాకర్షణను చర్చించక తప్పని పరిస్థితి ఉంది. మోదీ ఒక రాజకీయ శక్తిగా దీర్ఘకాలం నిలిచిపోతారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సామాజిక శాస్త్ర పితామహుడు మ్యాక్స్ వెబర్‌లోని ప్రజాకర్షక నాయకత్వ లక్షణాలు మహాత్మా గాంధీలో, మిగతా 2లో

## కరీంనగర్ లో దొంగల బీభత్సం...

కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలర్స్‌లో కాల్పుల ఘటన
దోపిడీ యత్నాన్ని అడ్డుకోవడంతో సిబ్బందిపై దుండగుల దాడి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)



కరీంనగర్‌లోని పీఎంజే జువెలర్స్‌లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల ముందే తాను అదే ప్రాంతంలో ఉన్నానని, తన కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన జరగడం బాధాకరమని ఆయన అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని మిగతా 2లో

## అమరావతిపై పసలేని ఆరోపణలు చేస్తున్నారు: ప్రత్తిపాటి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)



ఎన్నికల్లో వైకాపాను ప్రజలు చావుదెబ్బకొట్టినా.. ఆ పార్టీ నేతలు పద్ధతి మార్చుకోవడం లేదని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. అమరావతిపై వారు పసలేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. "వైకాపా అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని నాశనం చేశారు. ఇప్పుడు అమరావతి నిర్మాణాన్ని పవిత్ర యజ్ఞంలా చేపడుతున్నాం. రాజధాని అభివృద్ధిని వైకాపా నేతలు ఓర్వలేకపోతున్నారు" అని ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు.

## ఇరాన్ డీల్‌పై ట్రంప్ సమీక్ష... అయినా దాడులు తప్పవంటూ హెచ్చరిక!

ఇరాన్‌తో ఒప్పందంపై తనకు వివరించారని తెలిపిన డొనాల్డ్ ట్రంప్



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 03)

ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించిన కాన్సెప్ట్‌పై తనకు వివరించారని, అయితే తుది ప్రతిని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అదే సమయంలో టెహ్రాన్ దుందుడుకుగా ప్రవర్తిస్తే సైనిక చర్యకు వెనుకాడబోమని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఫ్లోరిడా నుంచి మియామి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు.

"ఒప్పందానికి సంబంధించిన కాన్సెప్ట్‌ను వారు నాకు వివరించారు. ఇప్పుడు పూర్తి వివరాలతో కూడిన ప్రతిని ఇవ్వనున్నారు" అని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, చర్చలకు సిద్ధమంటూనే ఒత్తిడిని కొనసాగించే ద్వంద్వ వైఖరిని వాషింగ్టన్ అవలంబిస్తోంది. ఇరాన్‌పై తిరిగి దాడులు చేసే అవకాశాన్ని మిగతా 2లో

## ఏపీలో విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్



వేసవిలో విద్యుత్ కోతలు ఉండొద్దన్న మంత్రి గొట్టిపాటి
అధికారిక, అనధికారిక కోతలకు ఆస్కారం ఇవ్వొద్దని వెల్లడి
పెరిగిన డిమాండ్ నేపథ్యంలో
విద్యుత్ సంస్థల సీఎండీలతో మంత్రి సమీక్ష
సమస్యలు తలెత్తితే వెంటనే పునరుద్ధరించాలని సూచన

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)

విద్యుత్ వినియోగదారులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో వేసవి డిమాండ్ ఎంత పెరిగినా విద్యుత్ కోతలు విధించడానికి వీల్లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. అధికారికంగా గానీ, అనధికారికంగా గానీ ఎక్కడా కరెంట్ పోకూడదని ఆయన స్పష్టం చేశారు. తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్తు సంస్థల ఛైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లతో (సీఎండీలు) మంత్రి నిన్న టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. వేసవిలో విద్యుత్ సరఫరా పరిస్థితిపై సమీక్షించారు. రాష్ట్రంలో సరిపడా విద్యుత్ అందుబాటులో ఉందని చెబుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల నుంచి ఫిర్యాదులు ఎందుకు వస్తున్నాయని మంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. అధిక వేడి కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అవ్వడం, అకాల వర్షాలతో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల కొన్నిచోట్ల స్థానికంగా అంతరాయాలు ఏర్పడుతున్నాయని వివరించారు. కారణం ఏదైనా ప్రజలు ఇబ్బంది పడకుండా మిగతా 2లో

## 14 పాయింట్లతో.. అమెరికాకు ఇరాన్ కొత్త ప్రతిపాదనలు..



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 03)

అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతోన్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సంఘర్షణను ముగించేందుకు ఇరాన్ 14 పాయింట్లతో కొత్త ప్రతిపాదనలను తెరపైకి తెచ్చింది. పాకిస్థాన్ ద్వారా దీన్ని తాజాగా అమెరికాకు పంపిందని టెహ్రాన్ అధికారిక మీడియా పేర్కొంది. ఈ ప్రతిపాదనలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా స్పందించారు. సంఘర్షణ ముగించేందుకు అమెరికా నుంచి వచ్చిన 9 పాయింట్లనకు స్పందనగా.. ఇరాన్ ఈ 14 పాయింట్లతో తాజా ప్రతిపాదనలు చేసింది. ఇందులో లెబనాన్‌తో సహా అన్ని విధాలుగా యుద్ధాన్ని ముగించాలని టెహ్రాన్ పిలుపునిచ్చింది. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ పొడిగింపును ఇరాన్ తిరస్కరించింది. తాత్కాలిక సంధికి బదులుగా.. 30 రోజుల్లోగా యుద్ధం శాశ్వతంగా ముగించేలా సమగ్ర పరిష్కారాన్ని కోరింది. దీంతో పాటు తమపై మళ్లీ దాడులు చేయకుండా భద్రతా హామీలు ఇవ్వాలని, సరిహద్దు ప్రాంతాల్లో అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. వివిధ దేశాల్లో స్తంభింపజేసిన తమ ఆస్తులను విడుదల చేయాలని, తమపై విధించిన ఆంక్షలను కూడా ఎత్తివేయాలని ప్రతిపాదనల్లో ప్రస్తావించింది. హార్మూజ్ జలసంధిలో దిగ్బంధనాన్ని ఎత్తివేయడం, మిగతా 2లో

## అమరావతి చంద్రబాబుకు బంగారు బాతు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

వైసీపీని గొడ్డలి పార్టీ అనడంపై చంద్రబాబుపై కాకాణి ఫైర్
చంద్రబాబు ఒక గడ్డపారలా ప్రజాధనాన్ని తవ్వుతున్నారని విమర్శ
అమరావతి నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపణ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)

వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ తీవ్రంగా స్పందించింది. చంద్రబాబే ఒక గడ్డపారలా మారి ప్రభుత్వ ఖజానాను, ప్రజా సంక్షేమాన్ని తవ్వి తీస్తున్నారని వైసీపీ ఎదురుదాడికి దిగింది. ఆదివారం నెల్లూరులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మిగతా 2లో

## పశ్చిమాసియా సంక్షోభం: భారత్ నుంచి తగ్గిన అంతర్జాతీయ ప్రయాణాలు

పశ్చిమాసియా సంక్షోభంతో మార్చిలో తగ్గిన అంతర్జాతీయ విమాన ప్రయాణాలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)



పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీని ఫలితంగా, ఈ ఏడాది మార్చిలో భారత్ నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు గణనీయంగా తగ్గాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక ప్రకారం గత నెలల వృద్ధితో పోలిస్తే మార్చిలో విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య 18.5 శాతం మేర క్షీణించింది. మొత్తం అంతర్జాతీయ విమాన రాకపోకల్లో 21.3 శాతం మిగతా 2లో

# ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

## బద్వేల్ డివిజన్ ఎన్నికల అభ్యర్థులు వీరే

## తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల అధికారి కేపీ రోనాల్డ్ శామ్యూల్ రాజు



(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 3)

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ డివిజన్ కార్యవర్గ ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఆదివారం విడుదల చేశారు. 2026-2029 కాల పరిమితికి గాను ఏకగ్రీవంగా ఎన్నుకున్న అభ్యర్థుల వివరాలు ఎన్నికల అధికారి కేపీ రోనాల్డ్ శామ్యూల్ రాజు అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడు ఎ శ్రీరంగనాథ్ (డిప్యూటీ తహశీల్దార్, ఆర్డీఓ కార్యాలయం, బద్వేల్), అసోసియేట్ ప్రెసిడెంట్ జె కెజియా జెట్టి (డిప్యూటీ తహశీల్దార్, పోరుమామిళ్ల), సెక్రటరీ టి మల్లికార్జున (డిప్యూటీ తహశీల్దార్, బద్వేల్), ట్రెజరర్ పి ప్రవీణ్ కుమార్ (డిప్యూటీ తహశీల్దార్, మైదుకూరు), వైస్ ప్రెసిడెంట్ పదవులకు ఎన్ నాగవహిని (బద్వేల్), డి రామ కిషోర్ (బి కోడూరు), కె మనోహర్ రెడ్డి (పోరుమామిళ్ల), వి సత్యమూర్తి (గోపవరం) లను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి సిద్ధేశ్వరయ్య, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఆర్ యానాదయ్య, జాయింట్ సెక్రటరీ పదవులకు టి సాయి తరుణ్, ఎన్ నాగేశ్వరి, ఎం సురేంద్ర నాయుడు, బి పాములేటి, అలాగే కార్యవర్గ సభ్యులుగా బి శశి ప్రేమ్, కె ప్రసాద్, జి ఎస్ చంద్రశేఖర్‌బాబు, బి ఆది లక్ష్మమ్మలు బద్వేల్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుండి రెవెన్యూ శాఖకు చెందిన పలువురిని నియమించినట్లు తెలిపారు.

## మొదటి పేజీ తరువాయి

### 'మోదీ తత్వం'పై విశ్వవిద్యాలయ పాఠ్యాంశం

మార్టిన్ లూథర్ కింగ్‌లో కూడా కనిపిస్తాయి. ప్రధాని మోదీలోనూ అదే తరహా ప్రజాకర్షణ కనిపిస్తుంది. దీనిపై శాస్త్రీయ విశ్లేషణ అవసరం" అని వీరేంద్రసింగ్ అన్నారు. మోదీ తత్వంపై ప్రవేశపెట్టిన పాఠ్యాంశంలో డిజిటల్ జాతీయతావాదం - మీడియా, పౌరసత్వం - అసమ్మతి, ప్రపంచీకరణ - వేర్పాటు రాజకీయాలు వంటి విషయాలు ఉంటాయని ఆయన వివరించారు.

### ఇరాన్ డీల్‌పై ట్రంప్ సమీక్ష... అయినా దాడులు తప్పవంటూ హెచ్చరిక!

తోసిపుచ్చలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ అంశంపై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో కూడా ట్రంప్ స్పందించారు. "గత 47 ఏళ్లుగా ప్రపంచానికి, మానవాళికి ఇరాన్ చేసిన నష్టానికి ఇంకా తగిన మూల్యం చెల్లించలేదు. కాబట్టి వారు పంపిన ప్రణాళిక ఆమోదయోగ్యంగా ఉంటుందని నేను ఊహించలేను" అని ఆయన పోస్ట్ చేశారు.

తమ ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా ఇరాన్ అమెరికాకు పంపింది. ఈ డీల్‌కు అంగీకరిస్తే కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరిస్తామని, అమెరికా దిగ్బంధనానికి ముగింపు పలుకుతామని ఇరాన్ తెలిపింది. అయితే, తమ అణు కార్యక్రమంపై చర్చలను తదుపరి దశకు వాయిదా వేయాలని ఇరాన్ కోరుతోంది. ఈ ప్రతిపాదనను ట్రంప్ గతంలో తిరస్కరించారు. దౌత్యపరంగా చర్చలకు కట్టుబడి ఉన్నామని, కానీ ఎలాంటి సైనిక చర్యకైనా దీటుగా బదులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు.

### ఏపీలో విద్యుత్ వినియోగదారులకు గుడ్ న్యూస్

చూడాలని మంత్రి సూచించారు. తాత్కాలికంగా సమస్యలు వచ్చినా యుద్ధప్రాతిపదికన స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా, అందుబాటులో ఉండాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు.

### అమరావతి చంద్రబాబుకు బంగారు బాతు: కాకాణి గోవర్ధన్ రెడ్డి

మాట్లాడుతూ ఈ ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, టీడీపీ నేతలు వైసీపీని హత్యారాజకీయాలు చేసే గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తున్నారని, కానీ వాస్తవానికి చంద్రబాబే ఒక గడ్డపారకు చిహ్నమని కాకాణి విమర్శించారు. అమరావతి ప్రాజెక్టు చంద్రబాబుకు, ఆయన బృందానికి ఒక బంగారు బాతుగా మారిందని ఆరోపించారు. ఒకవైపు పెంచిన కాంట్రాక్టుల ద్వారా ప్రజాధనాన్ని దోచుకుంటూ, మరోవైపు విద్య, వైద్యం, రైతులు, మహిళలు, యువతను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతిలో చదరపు అడుగు నిర్మాణానికి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 20,489 చెల్లిస్తున్నారని, సాధారణంగా దీనికి రూ. 4,500 మాత్రమే ఖర్చవుతుందని కాకాణి అన్నారు. తెలంగాణ సచివాలయం, పార్లమెంట్ భవనం నిర్మాణ ఖర్చులు కూడా ఇంతకంటే చాలా తక్కువని గుర్తుచేశారు. గతంలో తనకు అనుకూలంగా ఉన్నవారికే మళ్లీ కాంట్రాక్టులు కట్టబెట్టి, రేట్లు పెంచి వ్యవస్థీకృతంగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎన్టీఆర్ నుంచి పార్టీని, పదవిని లాక్కోవడంతో మొదలైన చంద్రబాబు తీరు మారలేదని, అవినీతి, కుట్రలు ఆయన నైజమని విమర్శించారు. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు వల్ల ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉండదని, రాబోయే ఎన్నికల్లో వైసీపీకి సంపూర్ణ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాకాణి ధీమా వ్యక్తం చేశారు.

### పశ్చిమాసియా సంక్షోభం: భారత్ నుంచి తగ్గిన అంతర్జాతీయ ప్రయాణాలు

తగ్గుదల నమోదైంది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో దుబాయ్, ఖతార్ వంటి ప్రధాన రవాణా కేంద్రాలకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఐరోపా, అమెరికా వెళ్లే విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనికి తోడు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలు గతేడాదితో పోలిస్తే 34 శాతం పెరిగాయి. ఈ పరిణామాలతో విమానయాన సంస్థలకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలోనే పలు అంతర్జాతీయ సర్వీసులను తగ్గించుకుంటున్నట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. పెరిగిన ఇంధన ధరలు, గగనతలాల మూసివేత కారణంగా చాలా అంతర్జాతీయ సర్వీసులు నష్టదాయకంగా మారాయని ఎయిర్ ఇండియా సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ తెలిపారు. ఈ కారణంగా మే నుంచి జులై వరకు సుమారు 12 శాతం లాంగ్-హాల్ విమానాలను తగ్గించనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రయాణికులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని, పరిస్థితి చక్కబడగానే సర్వీసులను పునరుద్ధరిస్తామని ఆయన పేర్కొన్నారు.

### 14 పాయింట్లతో.. అమెరికాకు ఇరాన్ కొత్త ప్రతిపాదనలు..

యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించడం వంటివి కూడా ఇందులో ఉన్నాయి.

**బంతి అమెరికా కోర్టులోనే: ఇరాన్**

యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే తమ ప్రతిపాదనల లక్ష్యమని ఇరాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ పేర్కొన్నారు. దౌత్య మార్గాన్ని ఎంచుకోవాలా.. లేదంటే ఘర్షణ వైఖరినే కొనసాగించాలా అనే నిర్ణయం ఇప్పుడు అమెరికానే తీసుకోవాలన్నారు. తమ జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకునేందుకు ఇరాన్ రెండింటికీ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు.

**త్వరలో సమీక్షిస్తా: ట్రంప్**

ఇరాన్ పంపిన ప్రతిపాదనలపై ట్రంప్ స్పందించారు. వీటిని త్వరలోనే తాను సమీక్షిస్తానని ట్రూత్ సోషల్ వేదికగా పేర్కొన్నారు. అయితే, గత 47 ఏళ్లుగా మానవాళికి, ప్రపంచానికి వారు చేసిన దానికి.. ఇంకా తగిన మూల్యం చెల్లించుకోలేదన్నారు. కాబట్టి.. ఈ ప్రణాళిక ఆమోదించేలా ఉంటుందని తాను అనుకోవడం లేదన్నారు.

### కరీంనగర్ లో దొంగల బీభత్సం...

కరీంనగర్ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురు సాయుధ దుండగులు కస్టమర్ల రూపంలో జువెలరీ షాపులోకి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు చూపించమని కోరారు. సిబ్బంది నగలు బయటికి తీయగానే, తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని, పోలీసు అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ పోలీసులు తక్షణమే స్పందించారని, పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని వివరించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, నిందితులను పోలీసులు త్వరలోనే పట్టుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




## ఏపీలో అరాచకం సృష్టించేందుకు వైకాపా యత్నం: మంత్రి పార్థసారథి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 03)

ఏపీలో కూటమి ప్రభుత్వం చేస్తోన్న పనులను అడ్డుకోవడమే వైకాపా పనిగా పెట్టుకుందని మంత్రి పార్థసారథి విమర్శించారు. రాష్ట్రంలో అరాచకం సృష్టించేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో రూ.6 కోట్లతో నిర్మించనున్న శ్రీదేవకి యశోద శ్రీకృష్ణ ఆలయానికి మంత్రులు పార్థసారథి, రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడుతూ వైకాపాపై విమర్శలు గుప్పించారు. "రాష్ట్రంలో గొడ్డలి పార్టీగా పేరు పొందిన వైకాపా.. రాజకీయ లబ్ధి కోసం అరాచకాలు సృష్టించాలని చూస్తోంది. ఆ పార్టీ రాష్ట్రంలో క్రెడిట్ చోరీ అనే కొత్త నినాదాన్ని ఎత్తుకొని ప్రజలను మభ్యపెడుతోంది. వైకాపా క్రెడిట్ 11 సీట్లు అయితే.. కూటమి ప్రభుత్వ క్రెడిట్ 164 సీట్లు. కడప స్టీల్ ప్లాంట్ పనులను గత ప్రభుత్వం గాలికొదిలేస్తే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పనులు చేపట్టి 2028 నాటికి ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో తీసుకెళుతుంటే.. వైకాపా నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలకే పరిమితం కాకుండా.. ప్రైవేట్ రంగంలోనూ వారికి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది" అని తెలిపారు.

## దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 3)

యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపకులో ఒకరు కామ్రేడ్ దాచూరి రామిరెడ్డి. ఆదివారం డిఆర్ఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును ప్రతి రెండు నెలలకు ఒకసారి మొదటి ఆదివారం నిర్వహిస్తున్నారాని, ఇందులో యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘ కార్యకర్తలు అధిక సంఖ్యలో భాగస్వామ్యులు అవుతున్నారని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హై తెలియజేశారు. ఈ క్యాంపు నందు (బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం) నాలుగు రకాల వ్యాధులకు ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపం నందు మెడికల్ క్యాంపును నిర్వహించారన్నారు. ఈ క్యాంపుకు విజయవాడలోని స్పెషలిస్ట్ డాక్టర్ గోపాలం శివ నారాయణ ఎండి డిఎం న్యూరాలజీ, డాక్టర్ బి హరిబాబు ఎంబిబిఎస్ వీరితో పాటు పది మంది ఒంగోలు నగరంలోని స్పెషలిస్ట్ డాక్టర్లు పాల్గొని వైద్య సేవలు అందించారు. ఆదివారం 1618 మంది పేదలకు వైద్య సేవలు, మందులు అందించారు. రెండు నెలలకు సరిపడే రూ.2 వేలు విలువ చేసే మందులను కేవలం రూ.200లకు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా శాఖ పూర్తి సహాయ సహకారాలు అందించడం జరిగిందన్నారు. ఈ క్యాంపు నిర్వహణలో తమ సొంత ల్యాప్టాప్ తీసుకోవచ్చి కంప్యూటర్ ఆపరేటర్స్‌గా, మెడికల్ వాలంటీర్స్‌గా పాల్గొన్న యుటిఎఫ్ కార్యకర్త ప్రతి ఒక్కరికి, ప్రత్యేకించి రిటైర్డ్ పెన్షనర్స్ నాయకులు, యుటిఎఫ్ మహిళ కార్యకర్తలకు జిల్లా శాఖ పక్షాన అభినందనలు తెలియజేశారు. మెడికల్ క్యాంపు నందు యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు డి వీరాంజనేయులు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు వై వెంకట్రావు, జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి, కటకం జగదీశ్వరి, ఎం సంధ్య రాణి, కె లక్ష్మీనారాయణ, కాట్రగడ్డ నరసింహారావు, షేక్ అజీమ్ భాష, కొప్పర్తి శ్రీనివాసులు, సిహెచ్ ఉమామహేశ్వరరావు, టి శ్రీనివాసులు, కుర్ర రామారావు, కృష్ణమోహన్, నేతి శ్రీనివాసులు, ఆర్ నారాయణ, శ్రీనివాసరెడ్డి, శుద్ధపల్లి ప్రసాద్, కె సుబ్రమణ్య, గంగిశెట్టి రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.








ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
04.05.26 సోమవారం


# మంత్రి లోకేశ్ చొరవతోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

**ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా ప్రభుత్వ బడుల్లో ఫలితాలు**
**కూటమి ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా విద్యావ్యవస్థ**
**ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్**



**(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 3)**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న చర్యల కారణంగానే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు పోటీగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గతంలో ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల ర్యాంకులతో ప్రకటనలు ఇచ్చేవని, ఇప్పుడు నారా లోకేశ్ చొరవతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రభుత్వం ప్రకటనలు ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి పేర్కొన్నారు. లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతంగా జరుగుతోందని తెలిపారు. అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటనలో భాగంగా ఉప్పలపాడు ప్రభుత్వ పాఠశాలలో 23 మంది విద్యార్థులకు, వెంపరాల ప్రభుత్వ పాఠశాలలో 32 మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లను పంపిణీ చేశారు. వెంపరాల ప్రభుత్వ పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన స్మారక కళావేదికను మంత్రి ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఝాన్సీ నాగ వెంకట సాయిశ్రీ ను మంత్రి గొట్టిపాటి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండేదని, అయితే మంత్రి నారా లోకేశ్ మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యావ్యవస్థను రాజకీయాలకు అతీతంగా తీర్చిదిద్దుతోందని అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు అందిస్తున్నా షూ, బెల్ట్, యూనిఫార్మ్ ల పై ఎలాంటి రాజకీయాల పార్టీలకు సంబంధించిన గుర్తులు, రంగులు లేకుండా చూస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు పంచుతున్న సైకిళ్లకు కూడా తెలుగుదేశం పార్టీ రంగులు కానీ, గుర్తులు కానీ లేకుండా ఉచితంగా దాతల సాయంతో ఇస్తున్నామని వివరించారు.

**బీటీ, సీసీ రోడ్లు ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి**

గొట్టిపాటి రవి కుమార్ పర్యటనలో భాగంగా అద్దంకి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.5.10 కోట్ల వ్యయంతో శాంతినగర్ నుంచి ఏలేశ్వరవారిపాలెం వరకు నిర్మించిన బీటీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.1.15 కోట్లతో ఉప్పలపాడు, మైలవరం, వెంపరాలలో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అద్దంకి నియోజకవర్గంలో ఆర్డీఎస్ఎస్ పథకం కింద కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు గ్రామాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.






# ప్రశాంతంగా నీట్ పరీక్ష
## పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ పి రాజాబాబు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 3)**

జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆదివారం నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయం, డి.ఆర్.ఆర్.ఎం. మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, పివిఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ పరీక్షలు జరిగాయి. మొత్తం 1728 మంది అభ్యర్థులకుగాను 1681 మంది హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయం కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. భద్రతా ఏర్పాట్లు, పరీక్ష కేంద్రాలలో కల్పించిన సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఇతర అధికారులు ఉన్నారు.




# రాష్ట్రంలో 5 వేల ఆలయాల పునర్నిర్మాణం



మరో 800 ఆలయాల పునరుద్ధరణ
శ్రీవాణి ట్రస్ట్ ద్వారా భజన మందిరాలకు శ్రీకారం
దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి
ఎమ్మెల్యే ఇంటూరితో కలిసి ఉలవపాడులో నూతన రథాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం
నియోజకవర్గంలో 9 ఆలయాల పునర్నిర్మాణానికి 8.4 కోట్లు మంజూరు చేశామన్న మంత్రి ఆనం

4



# పిజిఆర్ఎస్ కార్యక్రమ సమయంలో మార్పు




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 3)**

మార్కాపురం కలెక్టరేట్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ (పీజీఆర్ఎస్) సమయంలో మార్పులు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 4వ తేదీ (సోమవారం) కలెక్టరేట్లో జరగబోవు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలోని ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు. ప్రజలు నిర్దేశించిన సమయానికి కార్యక్రమానికి చేరుకొని వారి వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు అందజేయాలని సూచించారు.

# 45 రోజులుగా వృధాగా పోతున్న త్రాగునీరు

**పట్టించుకోని అధికారులు**
**ఆందోళన చెందుతున్న గ్రామస్తులు**

**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 3)**

భూగర్భ జలాలు ఇంకి వేసవి కాలంలో త్రాగునీరు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో గ్రామ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్న మెయిన్ పైపు

4



# పురం సెంటర్‌లో అక్రమ బెల్ట్ షాపుల పై పోలీసుల దాడులు 56 మద్యం సీసాల స్వాధీనం



(షణ్ముఖ వెలుగు, కొండపి, మే 3)

ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలో అక్రమ మద్యం విక్రయాల పై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ సిఐ భీమా నాయక్ పర్యవేక్షణలో ఆదివారం టంగుటూరు పట్టణంలోని పురం సెంటర్లో ఉన్న రెండు బెల్ట్ షాపుపై ఒంగోలు టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 56 (180ఎంఎల్) మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతని వద్ద 46 వాటర్ బాటిల్స్, ఒక ఆడ మనిషి వద్ద 10 క్వార్టర్ బాటిల్స్ స్వాధీన పరుచుకుని తదుపరి చర్యల నిమిత్తం టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగింది. పట్టుబడిన మద్యం బాటిళ్లను, ఇద్దరిని టంగుటూరు పోలీసులకు అప్పగించగా టంగుటూరు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమ మద్యం విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ చెంచయ్య, ఏఎస్ఐ షేక్ మహబూబ్ భాషా, సిబ్బంది పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడిగా దోగిపర్తి బాలకృష్ణ



(షణ్ముఖ వెలుగు, చీరాల, మే 3)


ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా దోగిపర్తి బాలకృష్ణ నియమితులయ్యారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దూండి రాకేష్, అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని ఫెడరేషన్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ మామిడిపాక హరి ప్రసాద్, చీరాలలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బాపట్ల జిల్లా ఫెడరేషన్ సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యంగా ఉండాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని సూచించారు. బాపట్ల జిల్లాను ఫెడరేషన్‌లో ఆదర్శ జిల్లాగా నిలపాలని, సమాజ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా నియమితులైన బాలకృష్ణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరికీ అండగా నిలిచి, వారి అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, కార్యదర్శి గజబలి సాయి, కోశాధికారి కోళ్లపూడి శివన్నారాయణ, తమ్మన పవన్ కుమార్, ఉపాధ్యక్షులు పోతుగంటి రామాంజనేయులు, నూతికట్టు పూర్ణచంద్రావు, జాయింట్ సెక్రటరీ దోగిపర్తి వెంకట సురేష్ కుమార్, రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ గొంట్ల కోమలి, యువజన అధ్యక్షుడు పోతుల ప్రకాష్, జీడిపప్పు అసోసియేషన్ అధ్యక్షుడు ఊటుకూరి శ్రీనివాసరావు, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు, గ్రంధి నాగంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 5 వేల ఆలయాల పునర్నిర్మాణం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 3)

ఉలవపాడులోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానానికి నూతనంగా తయారు చేసిన రథాన్ని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ప్రస్తుతం స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్న వేళ ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని నేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.80 లక్షల సిజిఎఫ్ నిధులతో రథాన్ని తయారు చేయించామని తెలిపారు. 26 అడుగుల పొడవు, 11.5 అడుగుల వెడల్పుతో వందేళ్లపాటు నిలిచేలా అత్యంత సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు. రాష్ట్రంలో ఆలయాల పునర్నిర్మాణం, పునరుద్ధరణ, అర్చకులు మరియు పూజారుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ఒక్క ఆలయానికి కనీసం సున్నం కూడా వేయలేదని విమర్శించిన మంత్రి సనాతన ధర్మం, హిందు మతానికి వ్యతిరేకంగా ప్రచారం జరిగిందని విమర్శించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంచేలా తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో 9 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.8.40 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. త్వరలోనే మరో 30 ఆలయాలకు నిధులు ఇవ్వబోతున్నట్లు చెప్పారు. అలాగే దీపధూప నైవేద్యాల కింద, 50 వేల కంటే ఆదాయం తక్కువ ఉన్న నియోజకవర్గంలోని 49 ఆలయాలకు ప్రతి నెల 10 వేల రూపాయల చొప్పున రూ.58.80 లక్షలు విడుదల చేస్తున్నట్లు మంత్రి తెలియజేశారు. అలాగే నాలుగు గ్రామాల్లో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా భజన మందిరాలు నిర్మించినట్లు చెప్పారు. కరేడులోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి దేవస్థానం రాజగోపుర నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కోరికమేరకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యేతో కలిసి, తానే శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటానని చెప్పారు. రాష్ట్రంలో 5 వేల ఆలయాలను పునర్ నిర్మిస్తున్నామని, మరో 800 ఆలయాలను పునరుద్ధరిస్తున్నామని మంత్రి రామ నారాయణరెడ్డి తెలిపారు. ఒక కాలయానికి 20 నుంచి 40 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. టిటిడి సహకారంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు కేటాయిస్తున్నట్లు తెలియజేశారు. ప్రకాశం జిల్లాలో 13 భజన మందిరాల నిర్మాణం కోసం రూ.2.40 కోట్లు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. జిల్లాలో దీప ధూప నైవేద్యాల కింద 214 ఆలయాలకు ప్రతినెలా 2.54 కోట్లు ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే 53 ఆలయాల పునర్నిర్మాణానికి 54.57 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య నూతన రథోత్సవం కన్నుల పండుగలా జరిగింది. అంతకుముందు వేణుగోపాల స్వామి ఆలయంలో మంత్రి, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేవరపల్లి సుదీష్, చంద్రారెడ్డి దంపతులు, మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.









# 45 రోజులుగా వృధాగా పోతున్న త్రాగునీరు

పగిలిపోయి వేల లీటర్ల నీరంతా వృధాగా రోడ్ల మీద ప్రవహిస్తున్న వైనాన్ని సంబంధిత అధికారుల దృష్టికి గ్రామ ప్రజలు తీసుకెళ్లి, ఇప్పటికి 45 రోజులు గడిచినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మండలంలోని తాడివారిపల్లి గ్రామ కార్యదర్శి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు భానుడి ప్రతాపం..మరో వైపు అడుగంటుతున్న భూగర్భ జలాలు. ఇంకిపోయి చుక్కనీటి కోసం జనం అల్లాడుతుంటే, తర్లుపాడు మండలం తాడివారిపల్లి గ్రామంలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేల లీటర్ల తాగునీరు వృధాగా 45 రోజుల పోతున్నా, అదే పరిస్థితి కొనసాగుతూ గ్రామంలోని ప్రధాన రోడ్ల పై తాగునీటి పైపు లైన్, పగిలి నిరంతరం లీక్ అవుతూ వృధాగా పోతోంది. వేసవి కాలంలో ప్రతి చుక్కను ఒడిసి పట్టి పొదుపు చేయాల్సిన బాధ్యత అధికారులకు ఉన్నప్పటికీ అధికారుల కళ్ల ముందే ఇంత జరుగుతున్నా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఈ గ్రామంలోని ప్రజల నీటికష్టాలను తీర్చేందుకు సంబంధిత అధికారుల పై వెంటనే చర్యలు చేపట్టి గ్రామ ప్రజల దాహార్తి ని తీర్చేందుకు తక్షణమే కార్యదర్శి పై చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గ్రామ కార్యదర్శి నిర్లక్ష్య వైఖరిని, ఆమె ఒంటెద్దు పోకడ విధానాన్ని గమనించి గ్రామ ప్రజల ఎదుట ఎండగట్టి ప్రజల సమస్యలపై వాయిదా వేయకుండా సరైన సమయంలో స్పందించి ప్రజా నీటి కష్టాలను తీర్చేందుకు సెక్రటరీ కంకణబద్ధురాలై ఉండాలని ఉన్నతాధికాలను ప్రజలు కోరుతున్నారు.

# వేమన పద్యాలు ప్రాపంచిక సత్యాలు

### టిటిడి ధర్మాచార్య ఎంవిఎస్ శాస్త్రి

### ఉత్సాహంతో పాల్గొన్న శ్రీగిరి చిన్మయ బాల విహార్ విద్యార్థులు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 3)

వేమన పద్యాలు కల్మష భావాలను తొలగించి మంచి ఆలోచనలు రేకెత్తిస్తాయని టీటీడీ ధర్మాచార్య ఎం వి ఎస్ శాస్త్రి పేర్కొన్నారు, ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం చిన్మయ మిషన్ తోడ్పాటుతో శ్రీగిరి గో క్షేత్ర భవన్ లో ఆదివారం నిర్వహించిన శ్రీగిరి చిన్మయ బాలవిహార్ కార్యక్రమంలో శాస్త్రి పాల్గొని వేమన పద్యాలలోని ప్రాపంచిక సత్యాల గురించి వివరించారు. వేమన ఆటవెలది ఛందస్సులో ప్రతి ఒక్కరి జీవితానికి ఉపకరించే విధంగా పద్యాలను రచించాడని వెల్లడించారు. ఆత్మశుద్ధి లేని ఆచారమదియేల భాండ శుద్ధి లేని పాకమేల చిత్తశుద్ధి లేని శివ పూజలేలరా అంటూ నేరుగా ధైర్యంగా ప్రశ్నించిన ఘనత వేమన మహా కవికి దక్కుతుందని శాస్త్రి పేర్కొన్నారు, వేమన పద్యాలు మన లోని లోపాలను దోషాలను గుర్తించి మనల్ని మనం సంస్కరించుకునేందుకు ఉపకరిస్తాయని తెలిపారు. వేమన శతక సాహిత్యం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

శ్రీగిరి చిన్మయ బాలవిహార్ విద్యార్థులు కంఠస్థ పద్యాలతో శ్లోకాలతో తమ ప్రతిభను చాటి చెప్పారు. రామాయణం బొమ్మల పుస్తకంలోని చిత్రాలకు రంగులు వేయడంతో పాటు అంత్యాక్షరి పోటీలో విద్యార్థులు ఉత్సాహంతో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు. శ్రిష్టి పద్మావతి తదితరులు నిర్వహణా సహకారం అందించారు. శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో పాటు భక్తులకు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి దేవస్థానం చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో ప్రతి ఆదివారం శ్రీగిరి గో క్షే త్రంలో నిర్వహిస్తున్న శ్రీగిరి చిన్మయ బాలవిహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి కోరారు.ఎ1





# వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## కరపత్రాలు ఆవిష్కరించిన జిల్లా నాయకులు




(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 3)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 30వ మహాసభలు ఈ నెల 11, 12, 13 తేదీలలో అమలాపురంలో జరుగుతున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలియజేశారు. ఆదివారం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నెరసుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఎల్బీజీ భవన్ లో జరిగింది. ముందుగా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ఆంధ్రప్రదేశ్లోనూ, వ్యవసాయ రంగంలోనూ ఉత్పత్తికి మూలకారకులైన వ్యవసాయ కార్మికుల హక్కుల రక్షణ కోసం అమరవీరు పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో 1934లో వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పడిందని తెలిపారు. భూమి కోసం, భుక్తి కోసం, కష్టజీవులు విముక్తి కోసం వ్యవసాయ కార్మిక సంఘం సమరశీల ఉద్యమాలు సాగించిందని, విరోచిత పోరాటాలలో వేలాది ప్రాణ త్యాగాలు బలిదానాలు జరిగాయి తెలిపారు. దున్నేవానికి భూమి దక్కాలని, కష్టానికి తగిన ఫలితం కనీస వేతన చట్టం కావాలని సంఘం పోరాడినట్లు తెలిపారు. అటువంటి పోరాటాలు ఫలితంగా ప్రభుత్వం భూ సంస్కరణల చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. పేదల భూములు దురాక్రమనకు గురికాకుండా అడ్డుకునేందుకే 9/77 లాంటి చట్టాలు వచ్చాయని తెలిపారు. వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, పోరాడి సాధించిన చట్టాలను నేడు పాలకులు కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో, ఆధునికరణ పేరుతో పేదల వద్ద నుండి బలవంతంగా భూములు గుంజుకుంటున్నారని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం లాంటివి పేద రైతులకు రక్షణగా ఉన్న వాటిని రూపుమాపే విధంగా కేంద్రంలోని ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. ప్రజల మౌలిక వసతులు తీర్చాల్సిన బాధ్యత నుంచి పాలకులు తప్పుకున్నందున ప్రజల మీద భరించలేని భారాలు పడుతున్నాయని అన్నారు. పేదలకు ఆసరాగా ఉన్న ఉపాధి హామీ ఇలాంటి చట్టాలను కూడా నిర్వీర్యం చేస్తున్నారు అని అన్నారు. ఈ స్థితిలో జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలోనీ గ్రామీణ పేదల సమస్యలన్నీ సమగ్రంగా చర్చిస్తామని, వాటి పరిష్కారానికి పోరాటాలు రూపొందిస్తామని తెలిపారు. ప్రకాశం జిల్లా నుండి 25 మంది ఎంపిక చేయబడిన ప్రతినిధులు ఈ మహాసభకు వెళుతున్నాను తెలిపారు. మహాసభ నేర్పడానికి ప్రజలందరూ తోడ్పాటు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకుడు జాలా అంజయ్య, జిల్లా నాయకులు మూంద్రు ఆంజనేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, ఉబ్బా వెంకటేశ్వర్లు, దువ్వూరి జాను, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు

### కళ్యాణ మహోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై

### పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే విజయ్ కుమార్






(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, మే 3)

మండలంలోని మల్లవరం గ్రామంలో ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వైభవంగా కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించారు. ఏప్రిల్ 28వ తేదీ నుండి మే 6వ తేదీ వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం స్వామి వార్లకు ఈ కళ్యాణ మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్కు ఆలయ చైర్మన్ మార్నెని వీర రాఘవేంద్రరావు (రాఘవ), ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ వెంకటచార్యులు ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తదుపరి ఎమ్మెల్యే విజయ్ కుమార్ను ఆలయ చైర్మన్ ఎం రాఘవ, తదితరులు సత్కరించారు. వేద పండితులు మద్దిపాడు మండలం నరసాయ పాలెం గ్రామానికి చెందిన దివి వెంకట శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ వెంకట చార్యులు, రాజశేఖర్ చార్యులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణానికి ఉభయ దాతలుగా పల్లంకి తరుణ్ ఆదిత్య, నాగ కిష్ట సాయి కుమార్ రెడ్డి, పల్లంకి మణికంఠ శ్రీనివాస్రెడ్డి, పి భరణి, కృష్ణమోహన్రెడ్డిలు వ్యవహరించారు. భక్తులు వేలాదిగా ఈ కళ్యాణ మహోత్సవానికి తరలివచ్చారు. తదుపరి అన్నదాన వేడుకలు నిర్వహించారు . ముఖ్యంగా ఆయా కుల సంఘాల సత్రాల వద్ద భారీ ఎత్తున అన్నదాన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణంలో భాగంగా గుళ్లా పల్లి వాస్తవ్యులు పల్లంకి సుబ్బరామిరెడ్డి నాగమ్మ కుటుంబీకులు తలంబ్రాలు, తదితర వస్త్రాలను సమర్పించారు. స్వామి వారి కళ్యాణ పూజల్లో ఎర్రారెడ్డి, సీతామాలక్ష్మి దంపతులు కూర్చున్నారు. ఈ వేడుకలను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి లీలా కృష్ణ, కమిటీ సభ్యులు, దాతలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఎంపీడీవో డి ఎస్ వి ప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాసరావు (పి.యస్.ఆర్), రాష్ట్ర టిడిపి కార్యదర్శి అడకా స్వాములు, శ్రీవారి వనం అధ్యక్షులు ఎం కృష్ణారావు, మండవ జయంతి బాబు,నిత్య అన్నదాన కమిటీ చైర్మన్ నారి పెద్ది వరహాల చౌదరి, పంచాయతీ అభివృద్ధి అధికారి నీలిమ, తదితరులు పాల్గొన్నారు. తదుపరి స్వామి వాళ్లకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయ దాతలుగా ఎం పెద్ద వెంకట్రావు, నాగరత్నమ్మలు వ్యవహరించారు. అంకమ్మ తల్లి కోలాట భజన బృందం ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. ఆదివారం జరిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ వేడుకలు ఒక పండుగ వాతావరణంలో జరిగాయి. వేలాదిగా భక్తులు, మహిళలు వేడుకలకు తరలివచ్చారు. మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.







# ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

### లబ్ధిదారుల ఇంటి ముంగిట

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఏలూరి

### ఇంకొల్లులో ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన

### 9 మందికి రూ.3.58 వేల చెక్కులు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మే 3)

ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి ముంగిటకు చేరవేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లబ్ధిదారుల ఇంటిముంగిటికే వెళ్లి సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆదివారం ఇంకొల్లు మండలంలో విస్తృతంగా పర్యటించారు. పలు కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి పరామర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద ఆర్థిక సాయం మంజూరైన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం రూ.9 మందికి రూ.3.58 వేల లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైద్య చికిత్సల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం పేదలకు ఎంతో ఊరట కలిగిస్తోందని అన్నారు.

ఈ సందర్భంగా లబ్ధిదారులు తమకు అందిన సాయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వాటికి తక్షణ పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆత్మీయ పరామర్శ...** ఇంకొల్లు మండల పరిధిలోని ఇంకొల్లు గొల్లపాలెం హనుమోజీపాలెం గ్రామాలలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే ఏలూరి పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు.

# కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థుల భవిష్యత్కు ఎంతో ఉపయోగం



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 3)

పెరుగుతున్న సాంకేతిక యుగంలో కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం అని రిసోర్స్ పర్సన్ ఎర్రవరపు రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నగంజాం శాఖ గ్రంథాలయం నందు గ్రంథపాలకుడు అలహరిలక్ష్మీమోహననరసింహచార్యులు ఆధ్వర్యంలో జరిగిన వేసవి విజ్ఞాన శిబిరంలో రిసోర్స్ పర్సన్ ఎ రామాంజనేయులు విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎ రామాంజనేయులు మాట్లాడుతూ విజ్ఞాన శిబిరాల్లో నేర్చుకున్న అంశాలు భవిష్యత్లో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. తెలియని విషయాలు ఎన్నో విద్యార్థులు నేర్చుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు అలహరి లక్ష్మీ మోహన నరసింహచార్యులు, రిసోర్స్ పర్సన్ ఎ రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్రహ్మానందరెడ్డిని పరామర్శించిన గాదె



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, మే 3)

పర్చూరు నియోజకవర్గ వైయెస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గాదె మధుసూధన్రెడ్డి ఆదివారం చినగంజాం మండల పార్టీ నాయకులు అసోది బ్రహ్మానందరెడ్డిని పరామర్శించారు. ఇటీవల అస్వస్థత గురైన బ్రహ్మానందరెడ్డి చికిత్స అనంతరం ఆయన కోలుకుని స్వగృహానికి చేరుకున్నారనే విషయం తెలుసుకున్న మధుసూధన్ రెడ్డి నేరుగా ఆయన నివాసానికి వెళ్ళి బ్రహ్మానందరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. బ్రహ్మానందరెడ్డి పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# తమ్మినేనికి నివాళులు





**(షణ్ముఖ వెలుగు, పామూరు, మే 3)**

కనిగిరి పట్టణ మాజీ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి గుండెపోటుతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న పామూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొల్ల నరసింహారావు, పామూరు పట్టణ అద్యక్షులు అమీర్ భాషా, ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, పామూరు ఈఓ అరబిందా, పలువురు కార్యకర్తలు కనిగిరిలోని ఆయన నివాసానికి చేరుకుని ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# అగ్నికి ఆహుతైన మొక్కజొన్న పంట

**పంటను పరిశీలించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు**
**నక్కలపాలెం, పావులూరు మధ్య భారీ అగ్నిప్రమాదం**
**రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధం**
**అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే ఏలూరి**
**జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తో మాట్లాడిన ఎమ్మెల్యే ఏలూరి**
**రైతుల అండగా నిలవాలని కోరిన ఎమ్మెల్యే ఏలూరి**
**వలపర్లలో మరో రెండు ఎకరాలు దగ్ధం**
**రైతుల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఏలూరి సూచన**

**(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, మే 3)**

నక్కలపాలెం, పావులూరు మధ్య ఉన్న పంట పొలాల్లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించి రైతులను కలవరపరిచింది. పొలాల్లో కోత అనంతరం మిగిలిన పొడి అవశేషాలు, గాలి వేగం కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీపంలోని పంటలకు ముప్పు తెచ్చాయి. ఈ ఘటనలో మార్టూరు మండలం వలపర్ల గ్రామానికి చెందిన గోరంట్ల కాశీ విశ్వనాథ్‌కు చెందిన సుమారు రెండు ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న వెంటనే పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అప్రమత్తమై అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకుని అగ్నికీలలను అదుపులోకి తేవడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేశారు. ఇదే సమయంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, సీఐ రామ్ నాయక్‌లను కూడా ఎమ్మెల్యే అప్రమత్తం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి మంటలు మరింత వ్యాపించకుండా కట్టడి చేయాలని సూచించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్‌ను క్షేత్రస్థాయిలో పరిస్థితులు పరిశీలించాలని ఆదేశించారు.

తరువాత సంఘటన స్థలానికి చేరుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దగ్ధమైన పంటలను పరిశీలించి బాధిత రైతును పరామర్శించారు. పంట నష్టం తగ్గించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, రైతుకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో మాట్లాడి పంట దగ్ధమైన ఘటన వివరాలను తెలియజేశారు. బాధిత రైతుకు తగిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ, నష్టం అంచనా వేసి ప్రభుత్వ పరంగా పరిహారం అందించేలా అధికారులను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**రైతులకు అప్రమత్త సూచనలు...**

వేసవి కాలంలో మొక్కజొన్న కోత అనంతరం పొలాల్లో అగ్ని ప్రమాదాలు అధికమవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ముఖ్యంగా మిగిలిన అవశేషాలను ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో కాల్చవద్దని హెచ్చరించారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కోత తర్వాత మిగిలిన చెక్కలు, ఎండిన ఆకులు, గడ్డిని కాల్చకుండా దుక్కిలో కలిపి కంపోస్టింగ్ చేయాలని సూచించారు. అవశేషాలను ఒకచోట కుప్పగా వేసి సహజ ఎరువుగా మార్చడం ద్వారా భూమి సారవంతత పెరుగుతుందని వివరించారు. పొలాల్లో పొడి చెత్త పేరుకుపోకుండా శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని చెప్పారు.

గాలి వేగం ఎక్కువగా ఉన్న రోజుల్లో చిన్న మంట కూడా పెద్ద ప్రమాదానికి దారి తీస్తుందని, కాబట్టి ఎండిన చెత్తను కాల్చడం పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. పొలాల్లో కార్మికులు బీడీలు, సిగరెట్లు కాల్చకుండా కట్టుదిట్టంగా నియంత్రించాలని సూచించారు. అలాగే ఎలక్ట్రికల్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వైరింగ్, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సరిగా ఉన్నాయో పరిశీలించాలని చెప్పారు. స్పార్కింగ్ కనిపిస్తే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా నీటి ట్యాంకులు, స్ప్రేయర్లు, ట్రాక్టర్ ట్యాంకర్లు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. దగ్గరలోని ఫైర్ స్టేషన్ ఫోన్ నంబర్లను ముందుగానే సేవ్ చేసుకుని కార్మికులకు తెలియజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు.





ఫొటో నెం. 5



# మీర్జా షంషేర్ ఆలీబెగ్ గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు వెలకట్టలేనివి

**చలివేంద్రం ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 3)**

వెనుకబడిన మార్కాపురం జిల్లాలో సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు అందించడమే కాకుండా మరోవైపు సామాజిక సేవ దృక్పథంతో వేసవి కాలంలో ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. మీర్జా షంషీర్ ఆలీబేగ్ గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ కేంద్రాన్ని ఆదివారం స్థానిక కోర్టు సెంటర్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షంషీర్ ఆలీబెగ్ ను ఆదర్శంగా తీసుకొని వేసవి కాలంలో మరింత మంది దాతలు సేవా కార్యక్రమాలను చేపట్టాలని పిలుపు నిచ్చారు. గత రెండు దశాబ్దాలుగా గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కొనియాడారు. గ్లోబల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీబేగ్ మాట్లాడుతూ మా తండ్రి స్వర్గీయ మీర్జా ఉస్మాన్ బేగ్ కోరిక మేరకు ఆయన సేవా కార్యక్రమాలను, ఆయన సేవలను కొనసాగించుకుంటూ ముందుకు వెళతామన్నారు. చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నా రాంబాబుకు డాక్టర్ మీర్జా షంషీర్ ఆలీబేగ్ సోదరులు శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ సిహెచ్ బాల మురళి క్రిష్ణ, ఎంఎస్ఎం ఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆర్యవైశ్య, అసోసియేషన్ రాష్ట్ర నాయకులు మేడ బద్రీనాథ్, బిసి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్, శ్రీశైలం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యులు పత్తి వెంగన్న, వైసిపి పోలింగ్ బూత్ రాష్ట్ర సెక్రెటరీ పత్తి రవిచంద్ర, వైసిపి స్టేట్ డాక్టర్స్ విభాగం ఉపాధ్యక్షులు సయ్యద్ మక్బుల్ భాష, నియోజకవర్గ పార్టీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు బొగ్గరపు శేషయ్య, మండల పార్టీ అధ్యక్షుడు లయోలా చెంచిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ సిహెచ్ బాల మురళికృష్ణ, మాజీ జడ్పీటీసీ జవ్వాజి రంగారెడ్డి, వైసిపి పట్టణ పరిశీలకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బి కాశయ్య, ఆర్ బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు

**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 3)**

జాతీయ రహదారి పై మండలంలోని కె రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రయాణికులకు స్వయంగా మజ్జిగ అందించారు. ఈ సందర్భంగా దాత కె రాజుపాలెం గ్రామ టిడిపి నాయకుడు కందలగడ్డ సాయి వరుణ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం ఉలవపాడు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కి రాజుపాలెం అడ్డరోడ్డు వద్ద ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు మంత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మద్దసాని మహేంద్ర, పార్టీ నాయకులు మార్టూరి కోటేశ్వరరావు, చలపతి, నారాయణరాజు, రాచగర్ల శివ, అమ్మనబ్రోలు రమేష్, అమ్మనబ్రోలు కిరణ్, పుల్లా వెంకట్, వాసు, తదితరులు పాల్గొన్నారు.











# పేదవారికి కష్టమొస్తే అండగా నేనుంటా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**పార్టీలకతీతంగా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం**

**ఇప్పటివరకు 10 కోట్లకు పైగా చెక్కులు అందించాం**

**అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కందుకూరు టాప్**

**ఎమ్మెల్యే చేతుల మీదుగా 39 మందికి 35.37 లక్షల సాయం**

(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 3)

కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో 34వ విడత సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై లబ్ధిదారులకు వాటిని స్వయంగా అందించారు. సిఎం రిలీఫ్ ఫండ్‌లు వలేటివారిపాలెం మండలం 8 మందికి రూ.2,87,280, లింగసముద్రం మండలం 5 మందికి రూ.1,79,919, కందుకూరు పట్టణం 9 మందికి రూ.11,99,829, కందుకూరు రూరల్ ముగ్గురికి రూ.8,72,278, గుడ్లూరు మండలం నలుగురికి రూ.1,63,537, ఉలవపాడు మండలం 10 మందికి రూ.8,35,031 రూపాయల సహాయాన్ని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదవారికి కష్టమొస్తే తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఖరీదైన వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమతలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటుందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 1279 మందికి సుమారు 10 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని ఎమ్మెల్యే వివరించారు. అత్యవసర వైద్యం అందించేందుకు వీలుగా ఎల్ఓసి ద్వారా 87 మందికి 2 కోట్లకు పైగా ఇచ్చామన్నారు. ప్రభుత్వం ద్వారా సాయం అందుకున్న లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం చూస్తుంటే, తనకెంతో సంతోషంగా ఉందని, పేదవారికి ఏ కష్టం వచ్చినా, ఆదుకోవడానికి తానెప్పుడూ సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ సహాయాలలో ప్రకాశం జిల్లాలో రెండవ స్థానంలో ఉన్నామని చెప్పారు. నెలనెలా జీతాలు ఇవ్వలేని పరిస్థితి నుంచి ఈ రోజు సంక్షేమానికి వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసే స్థితికి వచ్చామంటే, అది ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్పతనం అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని, చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, రూరల్ అధ్యక్షుడు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వలేటివారిపాలెం మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, పట్టణ మాజీ అధ్యక్షుడు కంద్రా మాల్యాద్రి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, నియోజకవర్గ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, పార్టీ నాయకులు కూనం నరేంద్ర, చుండూరి శ్రీను, చిత్తారి మల్లికార్జున, అమరనేని రాములు, కంకణాల సుబ్బులు నాయుడు, నీలం బ్రహ్మారెడ్డి, కిలారి మాధవ, ఉమ్మనేని సుబ్బారావు, ఉమ్మడిపోలు హరిబాబు, మురారిశెట్టి సుధీర్, తదితరులు పాల్గొన్నారు.





# గ్రంధాలయంలో క్విజ్ పోటీలు

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 3)

ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వారి శక్తి సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకొని క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఎండ తీవ్రంగా ఉన్నందున వారికి స్వర్గీయ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి వారసులు కోటిరెడ్డి, సుచరితారెడ్డి పిల్లలకు శీతల పానీయాలు అందించి వారి ప్రేమకు పాత్రులయ్యారు. వారికి గ్రంథ పాలకుడు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ రోజు కార్యక్రమానికి మొత్తం 17మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథపాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.






# శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో కాపు నేతలు

(షణ్ముఖ వెలుగు, మద్దిపాడు, మే 3)

మండలంలోని మల్లవరం గ్రామం నందు ఆదివారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల కళ్యాణోత్సవం సందర్భంగా శ్రీ కృష్ణదేవరాయ కాపు సేవా సంఘం తరుపున అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దక్షిణ భారత కాపు జేఏసీ అధ్యక్షులు దాసరి రాము, మద్దిపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు నున్నా బాలసుబ్రమణ్యం, కాపునాడు ఒంగోలు పార్లమెంటరీ అధ్యక్షులు పోగుల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి దాసరి పిచ్చయ్య నాయుడు, వైస్ ప్రెసిడెంట్ చెంగల శెట్టి సుధాకర్, జాయింట్ సెక్రటరీ గారా నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొద్దుల శ్రీనివాస నాయుడు, ఒంగోలు పార్లమెంటరీ మహిళా ప్రధాన కార్యదర్శి నగుబోతు నిర్మల, మార్కాపురం జిల్లా కన్వీనర్ వెలుగోలు కాశీనాథ్, మద్దిపాడు మండల కాపు నాయకులు, చీమకుర్తి మండల కాపు నాయకులు పాల్గొన్నారు.

# భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం..

**విజయవంతంగా నింగిలోకి 'మిషన్ దృష్టి'**

**బెంగళూరు స్టార్టప్ గెలాక్సీఐ స్పేస్ 'మిషన్ దృష్టి' శాటిలైట్ విజయవంతం**

**స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రయోగం**



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 03)

దేశంలోనే ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌గా రికార్డు

ఇది భారత యువత ఆవిష్కరణల పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనమన్న ప్రధాని మోదీప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ టెక్నాలజీ కలిగిన శాటిలైట్‌గా గుర్తింపుభారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ 'గెలాక్సీఐ స్పేస్' అభివృద్ధి చేసిన 'మిషన్ దృష్టి' శాటిలైట్‌ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. దేశీయ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలో ఇది ఒక కీలక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.సుమారు 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి', ఇప్పటివరకు ఒక భారతీయ ప్రైవేట్ సంస్థ నిర్మించిన అతిపెద్ద ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' టెక్నాలజీ కలిగిన శాటిలైట్ కావడం విశేషం. ఈ విజయంతో గెలాక్సీఐ స్పేస్, అంతరిక్ష సాంకేతికతలో సరికొత్త హద్దులను చెరిపేస్తున్న స్టార్టప్‌ల సరసన నిలిచింది.ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. గెలాక్సీఐ వ్యవస్థాపకులు, యావత్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్'లో స్పందిస్తూ, "మన అంతరిక్ష ప్రయాణంలో గెలాక్సీఐ వారి మిషన్ దృష్టి ఒక ప్రధాన విజయాన్ని సూచిస్తుంది. ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ శాటిలైట్, భారతదేశంలో ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించడం మన యువత ఆవిష్కరణల పట్ల, దేశ నిర్మాణం పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. గెలాక్సీఐ వ్యవస్థాపకులకు, మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

# మోదీ మెచ్చిన ఆదర్శ గ్రామం... ఇక్కడ ఇళ్లలో వంట చేసే పనే లేదు!



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 03)

గుజరాత్‌లోని మెహసానా జిల్లాలో ఉన్న చాందన్కీ అనే గ్రామం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఊరిలో చాలా ఇళ్లలో ఇప్పుడు వంటగదులు మూతపడ్డాయి. గ్రామస్థులందరూ కలిసి భోజనం చేసేందుకు ఒక సామూహిక వంటశాలను ఏర్పాటు చేసుకున్నారు. వృద్ధాప్యంలో ఒంటరితనాన్ని దూరం చేసి, సామాజిక బంధాలను బలోపేతం చేస్తున్న ఈ వినూత్న ప్రయోగాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ప్రశంసించారు.

ఈ గ్రామంలోని యువతలో చాలామంది ఉపాధి కోసం నగరాలకు వలస వెళ్లారు. దీంతో వారి తల్లిదండ్రులు గ్రామాల్లో ఒంటరిగా మిగిలిపోయారు. వయసు పైబడటంతో వంట చేసుకోవడం కూడా వారికి భారంగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా, దాదాపు 20 ఏళ్లు న్యూయార్క్‌లో నివసించి తిరిగి వచ్చిన గ్రామ సర్పంచ్ పూనమ్‌భాయ్ పటేల్ ఈ సామూహిక వంటశాల ఆలోచనను ముందుకు తెచ్చారు.

ఈ వంటశాలలో నియమితులైన వంటవాళ్లు రోజూ రోటీ, సబ్జీ, కిచిడీ వంటి సంప్రదాయ గుజరాతీ భోజనాన్ని సిద్ధం చేస్తారు. గ్రామస్థులందరూ సోలార్ విద్యుత్‌తో నడిచే, ఎయిర్ కండిషన్డ్ కమ్యూనిటీ హాల్‌లో కలిసి భోజనం చేస్తారు. ఇందుకోసం ఒక్కొక్కరు నెలకు సుమారు రూ. 2,000 చెల్లిస్తారు. మొదట్లో కొన్ని సందేహాలు వ్యక్తమైనా, ఇప్పుడు ఈ కార్యక్రమం విజయవంతంగా నడుస్తోంది.

ఈ ఏర్పాటు వల్ల వృద్ధులలో ఒంటరితనం తగ్గడమే కాకుండా, రోజూ ఒకరినొకరు కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూ, సంతోషాలను, బాధలను పంచుకుంటున్నారు. కేవలం భోజనం చేయడమే కాకుండా, మానసిక ఆనందానికి, ఆరోగ్యానికి బలమైన సామాజిక బంధాలే కీలకమని ప్రపంచ ఆనంద సూచిక, హార్వర్డ్ వంటి సంస్థల అధ్యయనాలు చెబుతున్న మాటలను చాందన్కీ గ్రామం నిజం చేసి చూపిస్తోంది.

# ఇజ్రాయెల్‌ను బెంబేలెత్తిస్తున్న హిజ్బుల్లా డ్రోన్లు... ఏమిటీ టెక్నాలజీ...?

**ఇజ్రాయెల్‌పై హిజ్బుల్లా ఫైబర్ ఆప్టిక్ డ్రోన్ల వినియోగం**

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 03)



ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఘర్షణలో హిజ్బుల్లా సరికొత్త, ప్రమాదకరమైన ఆయుధాన్ని ప్రయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ జామింగ్‌కు ఏమాత్రం చిక్కని ఫైబర్ ఆప్టిక్ గైడెడ్ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లతో దాడులకు పాల్పడుతూ ఇజ్రాయెల్ సైన్యాన్ని (ఐడీఎఫ్) ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల జరిపిన ఇటువంటి దాడిలోనే 19 ఏళ్ల ఐడీఎఫ్ సార్జెంట్ ఇడాన్ ఫూక్స్ మరణించగా, మరికొందరు సైనికులు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించిన వీడియోను హిజ్బుల్లానే స్వయంగా విడుదల చేసింది.

సాధారణంగా డ్రోన్లను రేడియో సిగ్నల్స్ ద్వారా నియంత్రిస్తారు. ఇజ్రాయెల్ తన సాంకేతికతతో ఆ సిగ్నల్స్‌ను జామ్ చేసి డ్రోన్లను నిర్వీర్యం చేస్తుంది. అయితే, హిజ్బుల్లా వాడుతున్న ఈ కొత్త డ్రోన్లు ఆపరేటర్‌కు ఒక సన్నని ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌తో అనుసంధానమై ఉంటాయి. దాదాపు 15 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ కేబుల్ కంటికి కనిపించకపోవడంతో, డ్రోన్‌ను గుర్తించడం, దానిపై దాడి చేయడం ఇజ్రాయెల్ సైన్యానికి కష్టంగా మారింది. చైనా లేదా ఇరాన్ నుంచి తెప్పించిన ఈ డ్రోన్లకు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వాడిన ఫైబర్ ఆప్టిక్ పరిజ్ఞానాన్ని హిజ్బుల్లా జతచేసింది.

ఈ డ్రోన్లు చాలా చిన్నవిగా ఉండి, గ్రెనేడ్ల వంటి పేలుడు పదార్థాలను మోసుకెళతాయి. వీటిని "చౌకైన, అదృశ్య, కచ్చితమైన కిల్లర్లు"గా అభివర్ణిస్తున్నారు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్ సైన్యం సరిహద్దుల్లో వలలు, ఇతర భౌతిక అడ్డంకులు ఏర్పాటు చేస్తోంది. ఎలక్ట్రానిక్ యుద్ధంలో ఆరితేరినప్పటికీ, ఈ తక్కువ ఖర్చు ఆయుధం తమకు పెను సవాల్‌గా మారిందని, దీనిని ఎదుర్కొనేందుకు ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నామని ఇజ్రాయెల్ అధికారులు అంగీకరిస్తున్నారు.

# పోషకాల గని.. తర్బూజా



సీజన్‌ను బట్టి మన జీవనశైలిలోనూ కొన్ని మార్పులు చేసుకోవాలి. ప్రత్యేకించి వేసవి కాలంలో శరీరానికి చలువనిచ్చే పండ్లను, కూరగాయలను ఆహారంలో తప్పకుండా భాగం చేసుకోవాల్సిందే. కాలానుగుణంగా లభించే పండ్లను అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో నీటి స్థాయిలు పెరగడమే కాకుండా కాలక్రమేణా రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఇక ఎండ వేడిమి నుంచి శరీరానికి తక్షణ శక్తినందించే పండ్లు ఎన్నో ఉన్నప్పటికీ తర్బూజా ప్రత్యేకత వేరని చెబుతున్నారు.

పోషకాలు పుష్కలం!

ఈ పండులోని వివిధ పోషకాలు శరీరంలో నీటి స్థాయిలను పెంచి డీహైడ్రేట్ కాకుండా కాపాడతాయి. ఇందులోని ఫైబర్ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచి మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

తర్బూజాలో విటమిన్-ఎ కూడా అధికంగా ఉంటుంది. ఇది కంటి సమస్యలను దూరం చేయడమే కాకుండా కంటి చూపు సామర్థ్యాన్ని పెంచుతుందట.

క్యాలరీలు తక్కువగా ఉండే ఈ పండును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీర బరువును నియంత్రించుకోవడంలో సహాయపడుతుంది.

ఈ పండుని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందట.

ఈ పండులోని పోషకాలు ఒత్తిడి, ఆందోళన సమస్యలను తగ్గించడమే కాకుండా కురుల సంరక్షణకు కూడా ఉపయోగపడతాయంటున్నారు నిపుణులు.

ఇన్ని ప్రయోజనాలున్నందుకే సమ్మర్‌లో ఈ పండును కచ్చితంగా డైట్‌లో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు.

# వేసవిలో చలువ చేసేందుకు..

ఎండలు మొదలయ్యాయి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ తరచూ పెదాలు ఎండిపోవడం, నాలుక తడారిపోవడం సహజమే! ఇది క్రమంగా డీహైడ్రేషన్ సమస్యకు దారితీస్తుంది. ఇలాంటప్పుడు మంచి నీటిని మరింత రుచిగా తయారుచేసుకొని తాగితే ఈ సమస్యను సులువుగా అధిగమించచ్చు.. తద్వారా శరీరానికి చలువ కూడా చేస్తుంది.

ఎండలు మొదలయ్యాయి. వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ తరచూ పెదాలు ఎండిపోవడం, నాలుక తడారిపోవడం సహజమే! ఇది క్రమంగా డీహైడ్రేషన్ సమస్యకు దారితీస్తుంది. ఇలాంటప్పుడు మంచి నీటిని మరింత రుచిగా తయారుచేసుకొని తాగితే ఈ సమస్యను సులువుగా అధిగమించచ్చు.. తద్వారా శరీరానికి చలువ కూడా చేస్తుంది.



కొన్ని రకాల పండ్లు, కూరగాయలు, తులసి, పుదీనా లాంటి ప్రత్యేకమైన ఆకులు నీటిలో వేయడం వల్ల వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు, ఖనిజాలు నీటిని మరింత శక్తిమంతంగా మారుస్తాయంటున్నారు నిపుణులు. ఇవి డీహైడ్రేషన్ నుంచి కాపాడటమే కాకుండా శరీరంలోని మలినాలనూ తొలగిస్తాయి.? సన్నగా గుండ్రంగా తరిగిన కీరా ముక్కలు, నిమ్మకాయ ముక్కలు, కొన్ని పుదీనా లేదా తులసి ఆకులు నీటిలో వేయాలి. మంచినీటికి బదులుగా వీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్ దరిచేరదు. అంతేకాదు.. నిమ్మకాయలోని ఎలక్ట్రోలైట్లు శరీరానికి శక్తినిచ్చి రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తాయి.



గుప్పెడు వట్టి వేర్లను శుభ్రం చేసి, ఒక నెట్‌క్లాత్‌లో వదులుగా కట్టి మంచినీటిలో వేయాలి. లేదా నేరుగా నీటిలో వేసి, వట్టి వేర్లు నీటి అడుగుకు చేరగానే పైన తేలిన నీటిని మంచినీళ్ల బదులుగా తాగితే శరీరంలోని వేడి తగ్గుతుంది. ఈ చిట్కా ఒత్తిడినీ దూరం చేస్తుందట. లీటరు నీటికి అర కప్పు చొప్పున పుచ్చకాయ ముక్కలు వేయాలి. అలాగే ఇందులో నాలుగు కీరా ముక్కలు, కొన్ని పుదీనా ఆకులు చేర్చాలి. మండే ఎండల్లో సైతం ఇది మీ శరీరాన్ని చల్లబరుస్తుంది. ముక్కలుగా చేసిన స్ట్రాబెర్రీ, గుండ్రంగా తరిగిన నారింజ ముక్కల్ని నీళ్లలో వేసుకొని తాగితే డీహైడ్రేషన్ తగ్గడమే కాకుండా.. శరీరానికి 'సి' విటమిన్ అందుతుంది. అంతేకాదు.. చర్మం కాంతివంతంగానూ మారుతుందట. గులాబీ రేకులను నీటిలో వేసి.. ఈ నీటిని తాగితే శరీరంలోని అధిక వేడి అదుపులోకి వస్తుందని చెబుతున్నారు నిపుణులు.

# చెమటతో తిప్పలా?



ఎండలో పొరపాటున బయట అడుగుపెట్టామంటే చాలు... చెమటతో ఒళ్లంతా తడిసిపోతుంది. శరీరానికి పట్టింది కాసేపటి ఆరిపోతుంది. కురులతోనే సమస్య. ఓ పట్టాన ఆరదు. పైగా దుర్వాసన, ఇన్‌ఫెక్షన్లు. తిప్పలు తప్పాలంటే... ఈ చిట్కాలు ప్రయత్నించండి.

ఎండలో పొరపాటున బయట అడుగుపెట్టామంటే చాలు... చెమటతో ఒళ్లంతా తడిసిపోతుంది. శరీరానికి పట్టింది కాసేపటి ఆరిపోతుంది. కురులతోనే సమస్య. ఓ పట్టాన ఆరదు. పైగా దుర్వాసన, ఇన్‌ఫెక్షన్లు. తిప్పలు తప్పాలంటే... ఈ చిట్కాలు ప్రయత్నించండి. తలలో చెమట తగ్గాలంటే ముందు చేయాల్సింది కేశ ఉత్పత్తులను మార్చడమే. ఈకాలం జిడ్డుగా ఉండే నూనెలు, క్రీమీ షాంపూలకు దూరంగా ఉండాలి. వీటికి మాడునుంచి విడుదలయ్యే నూనెలు, దుమ్మూ చేరి సూక్ష్మజీవులకు ఆవాసాలుగా మారతాయి. కాబట్టి, నీటి, జెల్ ఆధారిత షాంపూలను ఉపయోగించాలి. ఎండ వేడి నుంచి తప్పించుకోవడానికి చల్లదనం కోసం వెదుకుతుంటాం కదా! కురులకీ అది అవసరమే. అందుకని తలస్నానానికి ముందు కలబంద గుజ్జును కానీ, పుదీనా రసాన్ని కానీ మాడుకి పట్టించండి. ఇవి ఇన్‌ఫెక్షన్లను దూరంగా ఉంచడంతోపాటు, మాడునీ తాజాగా ఉంచుతాయి. ప్రతి రెండు రోజులకోసారి తలస్నానం తప్పనిసరి. అప్పుడు మాడు శుభ్రంగా ఉంటుంది. అయితే కురులు పూర్తిగా ఆరాకే జడ వేసుకోవాలి. జడనీ వీలైనంత వదులుగా వేసుకోండి. తలమీద నేరుగా పడే ఎండ కూడా చెమటకి కారణమే. కాబట్టి, ఎండలోకి వెళ్తున్నప్పుడు కాటన్, గాలి ప్రసరణ బాగుండే వస్త్రాలు లేదా టోపీతో తలని కవర్ చేయడం అలవాటు చేసుకుంటే మంచిది. చెమట నుంచి పూర్తిగా తప్పించుకోవడం కష్టం. కానీ కొన్ని జాగ్రత్తలతో సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. కురులనీ ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. ప్రయత్నించండి మరి.

# రోజ్ వాటర్ ఇలా కూడా




సౌందర్య పోషణకి వంటింటి చిట్కాలు పాటించే వాళ్ల దగ్గర తప్పక ఉండేదేదంటే రోజ్ వాటరే గుర్తొస్తుంది కదూ! దీన్ని ఫేస్ ప్యాక్‌లకే కాదు.. ఇంకా చాలా రకాలుగానూ వాడొచ్చని తెలుసా?

సౌందర్య పోషణకి వంటింటి చిట్కాలు పాటించే వాళ్ల దగ్గర తప్పక ఉండేదేదంటే రోజ్ వాటరే గుర్తొస్తుంది కదూ! దీన్ని ఫేస్ ప్యాక్‌లకే కాదు.. ఇంకా చాలా రకాలుగానూ వాడొచ్చని తెలుసా?

జుట్టు నిర్జీవంగా, గడ్డిలా కనిపిస్తోందా? అయితే రోజ్ వాటర్ స్ప్రే చేసి, ఆపై నెమ్మదిగా దువ్వండి. తేమ అంది, కురులు మెరుస్తాయి. మెత్తగా నిగనిగలాడుతూ కనిపించాలంటే గులాబీ నీటికి కొన్ని చుక్కలు ఆర్గాన్ ఆయిల్‌ని కలిపితే సరి.

సరిగా నిద్ర లేకపోయినా... బాగా అలసిపోయినా ఆ ప్రభావం కనిపించేది కళ్ల దగ్గరే కదూ! రోజ్ వాటర్‌ని కాసేపు ఫ్రిజ్‌లో ఉంచండి. తరవాత బయటకు తీసి, కాటన్ ప్యాడ్ మీద చిలకరించండి. ఆపై వాటిని కళ్లమీద ఉంచి, కాసేపు విశ్రాంతి తీసుకుంటే సరి. కళ్ల వాపు, ఎర్రదనం, అలసట... అన్నిటినీ మటుమాయం చేస్తుంది.

ఎండ వేడి, ఏసీ చల్లదనం ఏవైనా ముఖాన్ని నిర్జీవంగా మారుస్తాయి. అలాంటప్పుడు ముఖమ్మీద దీన్ని స్ప్రే చేసుకోండి. తేమను అందించడమే కాదు... తాజాగానూ మారుస్తుంది. పైగా మేకప్ వేసుకున్నా పనిచేస్తుంది. మిస్ట్‌లా పనికొస్తుంది కాబట్టి, బ్యాగులో తప్పక ఉంచుకోండి మరి.

ఎండలో కాసేపు ఉంటే చాలు చర్మం ఎర్రబడిపోతుంది చాలామందికి. ఆపై దురద, మంట. అలాంటప్పుడు చర్మాన్ని మరింత ఇరిటేట్ చేయని, ఇన్‌ఫ్లమేషన్ పెంచని పరిష్కారాలు కావాలా? అయితే రోజ్‌వాటర్‌ని కలబంద గుజ్జుతో కలిపి రాస్తే చాలు.

లిప్‌బామ్ ఎంత రాసినా ప్రయోజనం లేదా? ముందు కాస్త రోజ్‌వాటర్ పట్టించి, తరవాత లిప్‌బామ్ రాయాలి. దీనివల్ల తేమ ఎక్కువసేపు ఉంటుంది. పెదాలూ మృదువుగా కనిపిస్తాయి.

# కళ్ల కింద నల్లటి వలయాలు తగ్గాలంటే..



కళ్ల కింద నల్లటి వలయాలు.. చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఇది కూడా ఒకటి. అయితే ఈ సమస్యను కొన్ని సహజ చిట్కాలతోనే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

కళ్ల కింద నల్లటి వలయాలు.. చాలామందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో ఇది కూడా ఒకటి. అయితే ఈ సమస్యను కొన్ని సహజ చిట్కాలతోనే తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు.

కారణాలేమిటి?నిద్రలేమి, అలసట, కంప్యూటర్/మొబైల్ ఎక్కువసేపు వాడడం, ఒత్తిడి, పోషకాహార లేమి, తగినన్ని నీళ్లు తీసుకోకపోవడం.. ఇలా చాలా అంశాలు కళ్ల కింద నల్లటి వలయాలకు కారణం కావచ్చంటున్నారు నిపుణులు. అదేవిధంగా హైపర్ పిగ్మెంటేషన్, వృద్ధాప్యం, ఎగ్జిమా, కొన్ని రకాల ఎలర్జీలు, ఎండలో ఎక్కువగా తిరగడం, మేకప్ పూర్తిగా తొలగించుకోకపోవడం.. వంటి కారణాల వల్ల కూడా కళ్ల కింద చర్మం నల్లగా మారే అవకాశం ఉందంటున్నారు.

ఈ మార్పులు తప్పనిసరి!

ఈ సమస్య పరిష్కారం కోసం జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడంతో పాటు రోజూ కనీసం 7-8 గంటలు కంటి నిండా నిద్ర పోవాలి. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వినియోగాన్ని తగ్గించాలి. ఒత్తిడి, ఆందోళనల నుంచి దూరంగా ఉండాలి. ఇందుకోసం ధ్యానం, యోగా.. మొదలైన వాటిని జీవనశైలిలో భాగం చేసుకోవాలి అని సూచిస్తున్నారు నిపుణులు.

ఈ సహజ చిట్కాలతో..

ముఖాన్ని శుభ్రపరచుకోవడం కోసం చర్మతత్వానికి సరిపడే సబ్బులను ఎంచుకోవాలి.

మధ్యాహ్నం లంచ్ తర్వాత చాలామందికి నిద్ర ముంచుకొస్తుంటుంది. అయితే పని వల్లో, ఇతర కారణాల వల్లో ఆ నిద్రను ఆపుకోవడం.. లేదా కాఫీ, టీలతో నిద్రను దూరం చేసుకోవడం చేస్తుంటారు. ఇది మంచిది కాదు. ఇంట్లో ఉండే వారు వీలైతే మధ్యాహ్న సమయంలో కాసేపు కునుకు తీయడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. అయితే అది అరగంటకు మించకుండా చూసుకోవడం మంచిది. అర్ధరాత్రి వరకు మేల్కొనకుండా సాధ్యమైనంత త్వరగా నిద్రకు ఉపక్రమించాలి. దీనివల్ల కళ్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి, ఆందోళన కలిగించే వ్యక్తులు, వస్తువులకు పూర్తి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ల వాడకాన్ని తగ్గించాలి.యితే కళ్ల కింద నల్లటి వలయాలు ఒక్కోసారి అంతర్లీనంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలకు కూడా సంకేతం కావచ్చు. అందువల్ల పైన చెప్పిన చిట్కాలు పాటించినా సమస్య తగ్గకపోతే.. అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com